# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-09-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యతనివ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **తెలంగాణ సంస్కృతికి ప్రతీకలుగా వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలు, ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**

3. **బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.**

4. **ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది పురస్కారాలను ఈ ఏడాది డిసెంబర్‌లో ప్రదానం చేయనున్నామని సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.**

==========================

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యతనివ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం పర్యటనలో భాగంగా నూతన రైతు బజార్ భవన నమూనాను, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన చిత్ర ప్రదర్శనను ముఖ్యమంత్రి గత రాత్రి తిలకించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ,

వాయిస్..30 సెకన్లు

--------------------------

వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలు, ఢిల్లీలోని తెలంగాణ భవన్ నిర్మాణాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలుగా నిలిచేలా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. విమానాశ్రయాలు, ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణాలపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ చరిత్ర, సంస్కృతికి ప్రతిరూపాలైన కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయ శిల్ప, వాస్తు కళలను పరిశీలించి, వాటి ప్రత్యేకతలు ప్రతిబింబించేలా నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. విమానాశ్రయాల నుంచి రహదారులు నిర్మించి, వాటిని సమీప జిల్లా, రాష్ట్ర, జాతీయ రహదారులకు అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

--------------------------

పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన వాయుగుండం తీవ్ర వాయుగుండంగా బలపడిందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ వాయుగుండం ఈరోజు రాత్రి నుంచి రేపు తెల్లవారుజామున విశాఖపట్నం -గోపాల్‌పూర్ మధ్య తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాలలో ఈరోజు, రేపు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్ర సంచాలకులు కె.నాగరత్న తెలియజేస్తూ,

వాయిస్ .30..సెకన్లు

-------------------------

తీవ్ర వాయుగుండం ప్రభావంతోఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. విజయనగరం జిల్లాలో సహాయం కోసం 08922-236947, పార్వతీపురం మన్యం జిల్లాలో 08963-450347 నంబర్లను సంప్రదించాలని అధికారులు సూచించారు. వర్షాల కారణంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురంమన్యం జిల్లాల్లో పాఠశాలలకు ఈరోజు సెలవు ప్రకటించారు.

-------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించి, ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అనిత సూచించారు. ప్రభావిత జిల్లాల్లో విపత్తు నిర్వహణ బృందాలను సిద్ధంగా ఉంచాలని, అధికారులను ఆదేశించారు. ఆకస్మిక వరదల నేపథ్యంలో ఏటి గట్ల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి నిమ్మల రామానాయుడు జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు.

-------------------------

వాయుగుండం ప్రభావంతో తెలంగాణాలోని పెద్దపల్లి, జయంశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఈ రోజు, రేపు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

-------------------------

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను ప్రదానం చేశారు. ఫీచర్ సినిమాలు, నాన్-ఫీచర్ సినిమాలు సహా వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన కళాకారులు, సాంకేతిక నిపుణులు, చిత్రాలకు రాష్ట్రపతి పురస్కారాలను అందజేశారు. వీరిలో ఉత్తమనటులుగా మమ్ముట్టి, కార్తిక్ ఆర్యన్ పురస్కారాన్ని అందుకోగా, ఉత్తమ నటి పురస్కారాన్ని యామీ గౌతమ్ అందుకున్నారు. ఇక తెలుగు చలనచిత్రాలకు సంబంధించి ఉత్తమ బాల నటుడి విభాగంలో '35 చిన్న కథ కాదు' సినిమాకి అరుణ్ దేవ్, ఉత్తమ సంభాషణలు విభాగంలో 'లక్కీ భాస్కర్' సినిమాకు దర్శకులు వెంకీ అట్లూరి, ఉత్తమ ప్రజాదరణ చిత్రంగా

నిలిచిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి దర్శకులు నాగ్ అశ్విన్ పురస్కారాలను స్వీకరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది చలనచిత్ర, టీవీ పురస్కారాలను ఈ ఏడాది డిసెంబర్‌లో ప్రదానం చేయనున్నట్లు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 2012 నుంచి 2016 వరకు గతంలో ప్రకటించిన అవార్డులతో పాటు, 2017 నుంచి 2024 అవార్డులను, 2025 సంవత్సరానికి సంబంధించిన పురస్కారాలను కూడా అందించనున్నట్లు చెప్పారు. అమరావతి లేదా విజయవాడలో నంది చలనచిత్ర అవార్డులు, తిరుపతిలో నంది టీవీ అవార్డుల ప్రదానోత్సవాలు నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గత రాత్రి శ్రీ మలయప్ప స్వామివారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. దీనిపై మా ఆకాశవాణి ప్రతినిధి మరిన్ని వివరాలను అందిస్తారు.

వాయిస్..25.. సెకన్లు

---------------------------

మాదకద్రవ్య రహిత భారత్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్రాలు కృషిచేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. ఢిల్లీలోని భారత్ మండపంలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడో జాతీయ యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్ అధిపతుల సదస్సును ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ అమరావతి సచివాలయం నుంచి దృశ్య మాధ్యమం విధానంలో పాల్గొని మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన చర్యల గురించి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌ను క్యాన్సర్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా గుంటూరులో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ జీనోమిక్స్ సొల్యూషన్ కేంద్రాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్యుపరంగా వచ్చే క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు.

=====================